

ఆదర్శ పాఠశాలలో అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

బషీరాబాద్, జూన్ 13: బషీరాబాద్ మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాల, కళాశాలలో అధ్యాపకుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అల్తామస్ జహంగీర్ గురువారం తెలిపారు. గణితం, ఫిజిక్స్, బాటనీ బోధించుటకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఫిట్‌లెస్‌పై కొరడా

స్కూలు బస్సులపై రవాణా శాఖ నజర్



ఫిట్‌నెస్ లేని బస్సులపై రవాణా శాఖ కొరడా ఝుళిపిస్తోంది. నిబంధనలను పాటించకుండా నడుస్తున్న బస్సులను అధికారులు సీజ్ చేస్తున్నారు. బుధ, గురువారాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి 84 ప్రైవేట్ స్కూల్ బస్సుల యజమానులపై కేసులు నమోదు చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా విద్యార్థుల ప్రాణాల మీదికి తెస్తున్న స్కూల్ బస్సులను సీజ్ చేస్తున్నారు. బడులు ప్రారంభం కావడంతో అధికారులు బస్సులను తనిఖీ చేస్తూ కండిషన్ లేని వాటిపై చర్యలు తీసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ స్కూలు బస్సుల వివరాలు

మొత్తం బస్సులు :	11,922
ఫిట్‌నెస్ చేసినవి :	9,500
ఇంకా చేయాల్సినవి :	2,422

బస్సుల ఫిట్‌నెస్ నిబంధనలు ఇవీ..

- స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్‌కు సంబంధించిన పత్రాలు పొందడానికి నిబంధనలు కచ్చితంగా పాటించాలి. ఇందుకు కఠినంగానే నిబంధనలు పరిశీస్తున్నారు.
- విద్యార్థులను పరిమితికి మించి తీసుకెళ్లొద్దు.
- బస్సు చక్రాలు కొత్తవై ఉండాలి. 10శాతం కన్న ఎక్కువగా అరుగుదల ఉండొద్దు.
- బస్సులకు అద్దాలు ఉండాలి, ఎమర్జెన్సీ డోర్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.
- సరిపడా ప్రథమ చికిత్స మందులతో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉండాలి.
- బస్సు క్లచ్, బ్రేక్‌లను ఎప్పుడూ సరిచూసుకోవాలి.
- చిన్న పిల్లలు బస్సులో ఎక్కేందుకు మెట్లు కిందకి ఉండాలి.
- బస్సుకు సైడ్ రెయిలింగ్ అవసరం.. బస్సులో నిలువు రాడ్లు ఉండాలి.
- కార్నిక్స్ మిర్రర్ ఉండాలి. ఈ అద్దం గుండా బస్సులోని పిల్లలను ఎప్పటికప్పుడు డ్రైవర్ గమనిస్తుండాలి.
- బస్సుకు అప్పర్ లైట్లు ఉండాలి. బస్సును నడిపినప్పుడు ఈ లైట్లు వెలుగుతూ ఉండాలి
- ప్రతీ బస్సులో సహాయకుడు ఉండాలి. బస్సులో ప్రయాణించే ఆయా పిల్లల వివరాలు, చిరునామా, మొబైల్ నంబర్ బస్సుచార్ట్‌లో పొందుపర్చాలి.
- విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్‌తో కలిసి నెలకోసారి వాహనాన్ని పరిశీలించాలి.
- బస్సు డ్రైవర్ పేరు, చిరునామా, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి
- డ్రైవర్‌కు ప్రతీ మూడు నెలలకోసారి బీపీ, షుగర్, కంటి చూపు పరీక్షలను ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు చేయించాలి.
- 60ఏళ్లు పైబడిన వారిని డ్రైవర్‌గా నియమించొద్దు. వాహన డ్రైవర్‌కు కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి.
- కంటి చూపు, వినికిడి సమస్య ఉన్న వారితో డ్రైవింగ్ చేయించొద్దు.
- మద్యం వ్యసనం ఉన్న డ్రైవర్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలి.

- ఫిట్‌నెస్ లేకుండా రోడ్డెక్కితే కేసులే
- ఇప్పటి వరకు 84 బస్సులపై నమోదు
- తనిఖీలు ముమ్మరం చేసిన ట్రాన్స్‌పోర్ట్ అధికారులు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూలై 13 : ఈ నెల 12న పాఠశాలు తెరుచుకున్నాయి. ఇన్నాళ్లూ ఆటా పాటలతో గడిపిన పిల్లలు హుషారుగా స్కూళ్లకు వెళ్తున్నారు. అయితే పిల్లలను స్కూళ్లకు తీసుకువెళ్లే బస్సులతో మాత్రం తల్లిదండ్రులు కంగారు పడుతున్నారు. కొన్ని ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాలు ఫిట్‌నెస్ లేని బస్సులను నడుపుతుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వేలాది మంది పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ తీసుకుంటున్నారు. యాజమాన్యాలు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా విద్యార్థుల భద్రతను మాత్రం పట్టించుకోవడం లేదు. స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకునేందుకు సంబంధిత యాజమాన్యాలు అంతగా ఆసక్తి చూపడం లేదు. వాస్తవానికి బస్సులకు వేసవి సెలవుల్లోనే ఫిట్‌నెస్ టెస్టులు చేయించుకోవాల్సి ఉంటుంది. ఆ పరీక్షల్లో స్కూల్ బస్సు కండిషన్ బాగుందని రవాణా శాఖ అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. అలా సర్టిఫికెట్ పొందిన బస్సులను మాత్రమే రోడ్లపై తిరగడానికి అనుమతిస్తారు. అవి లేని బస్సులను తిప్పేందుకు వీల్లేదు. బడులు తెరవడానికి ముందే ప్రైవేట్ స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని రవాణాశాఖ అధికారులు వేసవి సెలవుల్లోనే సమాచారం ఇచ్చారు. వారితో సమావేశాలు కూడా నిర్వహించారు. స్కూల్ బస్సుల డ్రైవర్లకు హెవీ వెహికిల్ డ్రైవింగ్‌లో కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలని, 50ఏళ్లలోపు వయస్సు ఉండాలనే నిబంధనలపై వివరించారు. అలాగే బడి పిల్లలకు ఎక్కించుకునేందుకు, దించడానికి ప్రతీ బస్సులో ఒక సహాయకుడు(అటెండెంట్) కూడా తప్పనిసరి. డ్రైవర్ మద్యం తాగి ఉన్నాడో లేదో తెలుసుకునేందుకు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేశాకే బస్సు నడిపేందుకు అనుమతించాలని అధికారులు స్పష్టంగా పేర్కొన్నారు.

15ఏళ్లు దాటితే రోడ్డుపై తిప్పొద్దు

15 ఏళ్లు దాటిన విద్యా సంస్థలకు చెందిన బస్సులను ఎట్టి పరిస్థితుల్లో రోడ్లపై తిప్పరాదని రవాణా శాఖ స్పష్టం చేసింది. ఫిట్‌నెస్ లేని బస్సుల్లో విద్యార్థులను తరలిస్తే ఆ బస్సులను సీజ్ చేయడమే కాకుండా యాజమాన్యాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది.

84 బస్సులపై కేసు నమోదు

సూల్క్ బస్సుల ఫిట్‌నెస్‌పై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రవాణాశాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జల్లా వ్యాప్తంగా 5 బృందాలుగా ఏర్పడి తనిఖీలు ముమ్మరం చేశారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేస్తున్నారు. మొదటి రోజు 46 బస్సులపై కేసులు నమోదు చేయగా, రెండో రోజు చేవెళ్ల, శేరిలింగంపల్లి, షాద్‌నగర్, రాజేంద్రనగర్ తదిర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 38 బస్సులపై కేసులు మోదు చేశారు.


తనిఖీలు చేస్తున్న రవాణాశాఖ అధికారులు

తల్లిదండ్రులూ బాధ్యత తీసుకోవాలి..

విద్యార్థుల తల్లిదండ్రులు బస్సు కండిషన్ గురించి అప్పుడప్పుడూ తెలుసుకుంటూ ఉండాలి. పిల్లులు వచ్చీ పోయే బస్సుల విషయంలో యాజమాన్యం నిబంధనలు పాటిస్తున్నారో లేదో తరచూ పరిశీలించుకోవాలి. బస్సు అతివేగంగా వెళ్తుందా? డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారా? నిర్లక్ష్యంగా బస్సు నడుపుతున్నారా? పిల్లలను ఎక్కించి, దించేటప్పుడు బాధ్యతగా ఉన్నారా.. లేదా? తదితర భద్రత అంశాలపై తెలుసుకోవాలి. డ్రైవర్, అటెండెంట్ తీరు ఎలా ఉందనే విషయాలను పిల్లలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకోవాలి. సమస్యలు ఉంటే రవాణా అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాలి.

నిబంధనలు పాటించకపోతే కేసులు

- మైనర్లకు వాహనం ఇస్తే యజమానిపై చర్యలు
- వికారాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి



వికారాబాద్(ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేకుండా వాహనాలు నడిపితే ఆ వాహనాలను సీజ్ చేయడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని జిల్లా రవాణా శాఖ అధికారి పి.వెంకట్‌రెడ్డి అన్నారు. పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్ ప్రక్రియ పూర్తిచేసుకోవాలని యాజమాన్యాలకు సూచించినా కొందరు నిర్లక్ష్యంగానే ఉన్నారని, వెంటనే బస్సుల ఫిట్‌నెస్ పూర్తి చేసుకోవాలని సూచించారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. జిల్లాలో 200 వరకు పాఠశాలల బస్సులు ఉండగా, వాటిలో ఇప్పటి వరకు 130 బస్సులు ఫిట్‌నెస్ ప్రక్రియ పూర్తి చేసుకోగా, ఇంకా 70 బస్సుల యజమాన్యాలు ఫిట్‌నెస్ విషయంలో నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నాయన్నారు. విద్యా సంస్థల బస్సులపై స్కూల్ పేరు, ప్రిన్సిపాల్/కరెస్పాండెంట్ ఫోన్ నంబర్ విధిగా బోల్డ్ అక్షరాలతో ఉండాలన్నారు. డ్రైవర్ వయస్సు 60ఏళ్లలోపు ఉండాలన్నారు. జిల్లాలో ట్యాక్సీ ప్లేట్ వాహనాలు 65వేలు ఉండగా, సొంత వాహనాలు 1.75లక్షలు ఉన్నాయన్నారు. వాహనదారులు లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల రిజిస్ట్రేషన్, చిరునామా మార్పు, పర్మిట్, ఫిట్‌నెస్, ట్రేడ్ సర్టిఫికెట్లు, పన్నులు చెల్లింపు వంటి సేవలను ఆర్టీఏ కార్యాలయాలకు రాకుండానే టీ-యాప్ ఫోలియో యాప్ లేదా వెబ్‌ద్వారా పొందవచ్చన్నారు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. వాహనదారులు తమ మొబైల్ నంబర్ మారితే తప్పక అప్డేట్ చేసుకోవాలన్నారు. లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలన్నా, పన్ను చెల్లించాల్సి ఉన్నా, ఇతర సేవలకు వారం, పది రోజులు ముందుగానే ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ నుంచి వాహనదారుల మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు వస్తాయని తెలిపారు. ఎల్లో ప్లేట్ వాహనాలు తిరిగినా తిరగకపోయినా మూడు నెలలకోసారి తప్పనిసరిగా యజమానులు పన్నులు చెల్లించాలన్నారు. వాహనం వర్క్‌షాప్‌లో ఉన్నా.. లేక నడపకపోయినా సమీపంలోని ఆర్టీఏ కార్యాలయానికి సమాచారం ఇస్తే.. తిరిగి వాహనం నడిపే వరకు త్రైమాసిక పన్ను నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. గడువులోగా పన్ను చెల్లించి జరిమానా ఉందన్నారు. అధికారుల తనిఖీల్లో పట్టుబడితే 200శాతం వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో 9వేల వరకు సబ్సిడీ వాహనాలు, కమర్షియల్ ట్రాక్టర్ ట్రాలీల పన్నులు వసూలు కావాల్సి ఉందన్నారు. వ్యవసాయ పనులకు వినియోగించే ట్రాక్టర్ ట్రాలీలను కమర్షియల్ నుంచి అగ్రికల్చర్‌కు మార్చుకుంటే పన్ను నుంచి మినహాయింపు పొందవచ్చన్నారు. వాహన యజమానులు వాహనాలను విక్రయిస్తే కొనుగోలు దారు పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాలని, లేదంటే ఆ వాహనాలు ప్రమాదాలకు గురైనప్పుడు వాహన యజమానిపైనే కేసులు నమోదవుతాయన్నారు. కేసుల తీవ్రత ఎక్కువ ఉంటే జైలుకు కూడా వెళ్లాల్సి వస్తుందన్నారు. మైనర్లు వాహనం నడిపితే తండ్రులపై కేసు నమోదు చేసి జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉందని ఆయన వివరించారు.

రెండు రోజుల్లో 84 బస్సులపై కేసులు



స్కూలు బస్సుల తనిఖీలను ముమ్మరం చేశాం. ఇప్పటి వరకు 84 బస్సులపై కేసులు నమోదు చేశాం. మొదటి రోజు ఫిట్‌నెస్ లేకుండా రోడ్డుపైకి వచ్చిన 46 బస్సులపై, గురువారం రెండో రోజు 38 బస్సులపై కేసులు నమోదు చేశాం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11,922 విద్యా సంస్థల బస్సులు ఉన్నాయి. అందులో ఇప్పటి వరకు 9,500 బస్సులు ఫిట్‌నెస్ చేయించుకున్నారు. కానీ స్కూల్ బస్సుల్లో చాలా వరకు 15సంవత్సరాలు దాటడంతో ఫిట్‌నెస్ లేనివే ఎక్కువ ఉన్నాయి. ప్రతీ బడి బస్సును ఫిట్‌నెస్ టెస్ట్ చేయించుకోవాలి. 15ఏళ్లు దాటిన విద్యా సంస్థల బస్సులను రోడ్లపై తిప్పరాదు. 15సంవత్సరాలు దాటిన, ఫిట్‌నెస్ లేని బస్సుల్లో విద్యార్థులను రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేసి యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం. బస్సు కండిషన్‌లో ఉంచడంతో పాటు అనుభవజ్ఞులైన, 60 సంవత్సరాలకు మించని డ్రైవర్లనే నియమించుకోవాలి.

- మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్

దంచికొట్టిన వాన

- పలు ప్రాంతాలు జలమయం
- మంగల్‌పల్లిలో 74.5 మిల్లీ మీటర్ల వర్షపాతం
- వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు యువతి, ఆవు మృతి
- మెట్ట పంటల సాగుకు రైతులు సిద్ధం

రంగారెడ్డి అర్బన్/మంచాల/ఇబ్రహీంపట్నం/కేశంపేట, జూన్ 13: జిల్లాలో భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం పడింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. సాయంత్రం వేళలో ఉరుములు మెరుపులతో కూడి భారీ వర్షం కురిసింది. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అత్యధికంగా మంగల్‌పల్లిలో 74.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 55.8 మిల్లీ మీటర్లు, మంచాల మండలం ఆరుట్లలో 49.5 మిల్లీ మీటర్లు, కేశంపేట మండలం తొమ్మిదిరేకులలో 38.3 మిల్లీ మీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్‌లో 33.5 మిల్లీ మీటర్లు, మహేశ్వరం మండలం అమీర్‌పేట్‌లో 30.3 మిల్లీ మీటర్లు, మొయినాబాద్‌లో 24.5 మిల్లీ మీటర్లు, చేవెళ్ల మండలం ధర్మసాగర్‌లో 23.8 మిల్లీ మీటర్లు, మంచాల మండలం బొడకొండలో 23.3 మిల్లీ మీటర్ల చొప్పున వర్షం కురిసింది. కొన్ని చోట్ల వీచిన గాలులకు చెట్లకొమ్మలు విరిగాయి. విద్యుత్‌లో అంతరాయం ఏర్పడింది. మంచాల మండలంలో గురువారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఆరుట్ల, మంచాల, జాపాల గ్రామాల్లో వర్షం వానాకాలం పంటలకు జీవం పోసినట్లయింది. జొన్న, మొక్కజొన్న, పత్తి మొలకలు వాడుతున్న దశలో వానపడి మేలు చేసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ జిల్లా తాండూరులో గంటసేపు జల్లులు కురిశాయి. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఒంటిగంట ప్రాంతంలో ఈదురు గాలులతో వచ్చిన వర్షం గంటపాటు కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. నైరుతి ఆరంభం తరువాత కురిసిన పెద్ద వర్షం ఇదే! ఇబ్రహీంపట్నం సంతోష్ థియేటర్ ఎదురుగా ఉన్న కాలనీలో ఇళ్లలోకి నీరు చేరే అవకాశం ఉండడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, కమిషనర్ రవీందర్ సాగర్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. మ్యాన్‌హోళ్ల మూతలు తొలగించి వాన నీటిని మళ్లించారు. కేశంపేట మండలం బొదునంపల్లిలో పిడుగుపాటుకు పాడి ఆవు మృతిచెందింది. రైతు యెన్నం కృష్ణారెడ్డి ఆవులను పొలంలో మేపుతుండగా ఉరుములు, మెరుపులతో వర్షం, పిడుగు పడి ఆవు మృతి చెందింది.


పిడుగుపాటుకు మృతిచెందిన మధులత


మంచాలలో కురుస్తున్న వర్షం


ఇబ్రహీంపట్నంలోని మ్యాన్‌హోళ్ల మూతలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పిడుగుపాటుకు వ్యవసాయ కూలీ మృతి

తాండూరు రూరల్: పిడుగు పడి ఓ వివాహిత మృతిచెందింది. పెళ్లయిన ఏడాదికే యువతి మృతిచెందడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది. దుద్యాలకు చెందిన మధులత(22)కు తాండూరు మండలం కరన్‌కోట్‌కు చెందిన పర్తు మహేష్‌తో ఏడాది కింద వివాహమైంది. మహేష్ డ్రైవర్ పనిచేస్తుండగా, మధులత వ్యవసాయ కూలీగా పనిచేసేది. కరన్‌కోట్‌కు చెందిన మాజీ ఎంపీపీ శరణబసప్ప పొలాన్ని నర్సయ్యగౌడ్ కౌలుకు తీసుకున్నాడు. ఆ పొలంలో గురువారం పత్తి విత్తేందుకు తోటి కూలీలతో మధులత వెళ్లింది. కూలీలు పనిచేస్తుండగా వర్షం కురిసింది. అదే సమయంలో కూలీల మధ్య పిడుగు పడింది. దీంతో మధులత కుప్పకూలిపోయింది. వెంటనే ఆమెను కరన్‌కోట్‌లోని ఆసుపత్రికి, అక్కడి నుంచి తాండూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మధులత మృతి చెందినట్లు తెలిపారు. ఇదే ఘటనలో గాయాలైన మరో కూలీ దస్తమ్మ చికిత్స పొందుతోంది. మధులత మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

హరితహారం

లక్ష్యం 12లక్షల మొక్కలు

మేడ్చల్ జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హరితహారం లక్ష్యం ఖరారైంది. ఈ ఏడాది జిల్లాలో 12లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు 61 గ్రామపంచాయతీల్లో 14లక్షల మొక్కలను పెంచుతున్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన హరితహారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రాధాన్యం ఇస్తూ కొనసాగిస్తోంది. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఒక్కో నర్సరీనీ ఏర్పాటు చేసి ఒక్కో గ్రామంలో 10వేల నుంచి 40వేల మొక్కలు పెంచుతున్నారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలు ఎండకుండా నీరుపోస్తూ నర్సరీలపై గ్రీన్‌నెట్లను ఏర్పాటు చేశారు. ఈ మొక్కలను జూలై మొదటి వారంలో నాటేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పొలాల గట్లు, చెరువు కట్టల వెంట పశుపక్ష్యాదులు, ప్రజలు తినేందుకు అవసరమైన పండ్ల మొక్కలు, పూల మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. తొమ్మిదేళ్ల నుంచి జిల్లాలో కోట్ల వరకు మొక్కలు నాటారు. అయితే నాటే సమయంలో భవిష్యత్తు గురించి ఆలోచించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. సంరక్షించలేని చోట్ల మొక్కలను నాటడంతో అవి ఎండిపోతున్నాయి. అలాగే విద్యుత్ తీగలు కింద మొక్కలు నాటుతున్నారు. అవి పెరిగి తీగలకు తగులుతున్నాయని నరికేస్తున్నారు. అలాగే కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. లక్ష్యం మేర మొక్కలను నాటి చేతులు దులుపుకుంటున్నారు తప్ప వాటిని సంరక్షించడం లేదనే ఆరోపణలున్నాయి.


తిమ్మాయిపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో సాంబశివరావు

పకడ్బందీగా చేపడుతాం : సాంబశివరావు

జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. మొక్కలు నాటే స్థలాలను పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఎంపిక చేసేలా చర్యలు తీసుకుంటాం. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. ఈ సారి మొక్కలు నాటే లక్ష్యం పెరిగే అవకాశం ఉంది.


మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌తో ట్రైనీ ఐఏఎస్‌లు

జినోమ్ వ్యాలీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు

మేడ్చల్ జూన్ 13(ఆంధ్రజ్యోతి): 2023 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్‌లు గురువారం శామీర్‌పేట పరిధి జినోమ్ వ్యాలీని సందర్శించారు. జీనోమ్ వ్యాలీలో బయోలాజికల్-ఈ లిమిటెడ్ సెజ్ యూనిట్ సైంటిస్టులతో వారు మాట్లాడారు. వివిధ రకాల వ్యాక్సిన్ల తయారీ విధానంపై అడిగి తెలుసుకున్నారు. ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యతతో కూడిన వ్యాక్సిన్లను తయారు చేస్తున్న సైంటిస్టులను ట్రైనీ ఐఏఎస్‌లు అభినందించారు. అనంతరం మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌ను వారు సందర్శించి వివిధ పాలనాంశాలకు సంబంధించిన విషయాలను కలెక్టర్ గౌతమ్‌ను అడిగి తెలుసుకున్నారు. వారితో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- పుస్తకాలు అమ్ముతుండగా పట్టుకున్న ఏబీవీపీ నాయకులు
- సీజ్ చేసిన అధికారులు

వికారాబాద్, జూన్ 13: విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న ప్రైవేట్ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. వికారాబాద్‌లోని శ్రీ కృష్ణవేణి పాఠశాలకుచెందిన పాఠ్యపుస్తకాలను గురువారం ఓ షెటర్‌లో పెట్టి అమ్ముతుండగా వెళ్లి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను నిలదీసిన ఏబీవీపీ నాయకులు విద్యాశాఖ అధికారులకు ఫోన్‌చేసి వాటిని సీజ్ చేయించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్వర్ రావు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఈ దందా నడుస్తోందని, పాఠ్యపుస్తకాలకు ఒకధర, యూనిఫాంకు ఒక ధర నిర్ణయించి బయట వేరే షాపుల పేర్లుపెట్టి విక్రయిస్తున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అమ్మొద్దని జీవో ఉన్నా పట్టించుకోకుండా వారి వ్యాపారం వారు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మహేశ్ తదితరులున్నారు.


పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించడమే ధ్యేయం



టాయిలెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ ఎల్లూబాయి

శామీర్‌పేట, జూన్ 13: ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించి గ్రామాభివృద్ధికి తోడ్పాటు నందించడమే ధ్యేయమని ఎంపీపీ ఎల్లూబాయి అన్నారు. ఆమె గురువారం శామీర్‌పేట గ్రామానికి విచ్చేసి మండల పరిషత్, శామీర్‌పేట పంచాయతీకి చెందిన రూ.8.30లక్షల నిధులతో పలు నూతన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. గ్రామంలో రూ.4లక్షల పంచాయతీ నిధులతో రెండు చోట్ల నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు, రూ.లక్షా 50వేల మండల పరిషత్ నిధులతో అంగన్‌వాడీ కేంద్రంలో నూతన టాయిలెట్ల ఏర్పాటుకు, రూ. లక్షా 70వేల మండల పరిషత్ నిధులతో ఎస్సీ కాలనీలో నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు, రూ.లక్షా 30వేల మండల పరిషత్ నిధులతో ప్రాథమిక పాఠశాల గేటు ఏర్పాటు నిర్మాణ పనులను ఎంపీపీ చేపట్టి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముజీబుద్దిన్, సాయిబాబా, విజయలక్ష్మి, మౌనిక, ఐలయ్య, భూమిరెడ్డి, దాసరి బాబు, ఉప్పలయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

తాండూరు రూరల్, జూన్ 13: ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో విచ్చలవిడిగా వసూలు చేస్తున్న ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం కొత్తూరు చంద్రయ్య అన్నారు. ప్రైవేటులో ఫీజుల నియంత్రణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం తాండూరు ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవోఎంఎస్ నెంబర్-42 ప్రకారం జిల్లాలోని డీఎఫ్ఆర్‌సీ(డిస్ట్రిక్ట్ ఫీ రెగ్యులేటింగ్ కమిటీ) అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు పెంచాల్సి ఉంటుందన్నారు. అయితే, జిల్లా వ్యాప్తంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ మోసపూరిత ప్రకటనలతో ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. పుస్తకాలను రూ.8వేల నుంచి రూ.10వేల వరకు విక్రయిస్తున్నారని అన్నారు. కొన్ని బుక్‌స్టాల్స్‌తో ప్రైవేటు స్కూళ్లు కుమ్మక్కై కమిషన్లకు పుస్తకాలను, పోటు పుస్తకాలను అమ్ముతున్నారని తెలిపారు.. వెంటనే సంబంధిత జిల్లా విద్యాధికారి స్పందించి అక్రమ ఫీజులు వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేటు పాఠశాలలు, గుర్తింపు లేని పాఠశాలలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రవికుమార్ పాల్గొన్నారు.



తాండూరులోని ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



రికార్డులను పరిశీలిస్తున్న ఏటీడీవో వెంకటయ్య

గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

▸ జిల్లా గిరిజన సంక్షేమ సహాయ అధికారి వెంకటయ్య

ఆమనగల్లు, జూన్ 13: జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, విద్యార్థులు మరింత మెరుగ్గా రాణించేందుకు ఆశ్రమ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ సహాయ అధికారి వెంకటయ్య తెలిపారు. గురువారం మండల పరిధిలోని మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టిక, పాఠ్యపుస్తకాలు, ఆవరణను పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతులు, సదుపాయాలపై పాఠశాల హెచ్ఎం బాలరాజ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వసతి గృహంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీరు, ఆహారం విషయంలో సమస్యలు తలెత్తకుండా అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని, మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. అదేవిధంగా మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరం ఎస్ఎస్‌సీలో వందశాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల హెచ్ఎం బాలరాజ్‌తో పాటు ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం ఆయన మైసిగండి మైసమ్మ ఆలయాన్ని దర్శించుకొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. కడ్తాల గిరిజన బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి రాములు, ఉపాధ్యాయుడు నయీమొద్దీన్ తదితరులు ఆయనతో ఉన్నారు.

కొడంగల్‌కు రూ.73.45 కోట్లు మంజూరు

కొడంగల్, జూన్ 13: సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌కు మరోసారి భారీగా నిధులు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలోనే మెడికల్, ఇంజనీరింగ్, నర్సింగ్‌లతోపాటు ఇటీవల రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా గురువారం రూ.73.45 కోట్లు మంజూరుకు ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ గురుకుల కళాశాల భవన నిర్మాణానికి రూ.25 కోట్లు, పాఠశాలకు రూ.23.45కోట్లు, బొంరాసిపేట్‌లో బీసీ బాలికల గురుకుల పాఠశాలకు మరో రూ.25కోట్లు మంజూరు చేశారు. దీనికి సంబంధించి బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు.

చెరువులతో మానవ ప్రగతి

శంకర్‌పల్లి జూన్ 13: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అటవీశాఖ అదనపు కార్యదర్శి ప్రశాంతి తెలిపారు. ప్రొద్దటూరు పెద్ద చెరువు వద్ద గురువారం తడి నేలల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం చెరువు వద్ద విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ గురించి విద్యార్థులకు చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాలని సూచించారు. మొక్కలు నాటి వాటిని పరిరక్షించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లోని చెరువులతో ఎన్నో లాభాలు ఉన్నాయని వివరించారు. చెరువులు లేకపోతే నీటి సమస్య ఏర్పడుతుందని వివరించారు. చెరువులు, చిత్తడి నేలలు కబ్జా కాకుంగా చూడాల్సిన బాధ్యత అధికారులతో పాటుగా గ్రామస్తులపై ఉందన్నారు. చెరువులు చిత్తడి నేలలు జీవుల మనుగడకు జీవనోపాధికి ఉపయోగపడతాయని అన్నారు. చెరువులు జీవనాధారంతో పాటుగా మానవ ప్రగతికి తోడ్పతాయని ప్రశాంతి స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాఫీగా సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ మురుగనందన్, ఇరిగేషన్ ఎస్ఈ రంగారెడ్డి, వైస్ ఎంపీపీ బొల్లారం ప్రవళిక వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏనుగు నర్సింహారెడ్డి, ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంఈఓ అక్బర్, హెచ్ఎండీఏ, మత్స్యశాఖల అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాక అదనపు కార్యదర్శి ప్రశాంతి

పంటల సాగులో సేంద్రియ ఎరువులను వాడాలి

▸ జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

ధారూరు, జూన్ 13: పంటల సాగులో రైతులు సేంద్రియ ఎరువులను వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం, తాండూర్ వారి ఆధ్వర్యంలో వానాకాలం పంటలపై ముందస్తు ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని కేరెల్లి గ్రామంలోని రైతువేదికలో గురువారం నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సేంద్రియ ఎరువులతో భూమిలో సారం పెరిగి పంట దిగుబడులు అధికంగా వస్తాయన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సుధారాణి, టి.రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ పరిమల, యమునాలు మాట్లాడుతూ.. వివిధ పంటల సాగులో తీసుకోవాల్సిన మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. అపరాల పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, వానాకాలం పంటలపై ఆశించే వివిధ రకాల పురుగులు, తెగుళ్ల వాటి నివారణ, పత్తి పంటలో ఎత్తుమడులు, మొక్కజొన్న విత్తనాల్లో వివిధ రకాల వంగడాలు, వాటి సాగు, పంటకాల వ్యవధులు, పంటలపై ఆశించే పురుగుల నివారణకు లింగాకర్షణ దుస్తులను వాడే విధానం, ఉపయోగాలపై శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ టి.లక్ష్మణ్, మండల వ్యవసాయ అధికారి ఝాన్సీలక్ష్మీబాయి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్



భవిష్యవాణిలో పాల్గొన్న భక్తులు

వైభవంగా దుర్గామాత ఉత్సవాలు

▸ అమ్మ చల్లనిచూపుతో సబ్బండ వర్గాల సంక్షేమం



భవిష్యవాణి వినిపిస్తున్న ఏర్పులమ్మ

బొంరాస్‌పేట్, జూన్ 13: మండల కేంద్రం బొంరాస్‌పేట్‌లో దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా గురువారం ఏర్పులమ్మ వినిపించిన భవిష్యవాణి కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాల్లో అమ్మవారికి సమర్పించిన నైవేద్యాలతో అమ్మ సంతృప్తి చెందిందని, అమ్మ చల్లని చూపుతో గ్రామం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. సమృద్ధిగా వర్షాలతో పాడిపంటలు బాగా పండుతూ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉంటారని భవిష్యవాణి వినిపించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించిన పూర్ణకుంభాలను పోతురాజులు పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు తమ ఆడపడుచులతో పాటు బంధువులను తమ ఇళ్లకు తీసుకొచ్చారు. ఉత్సవాలకు గ్రామ పెద్దలు సుభాష్‌రావు, వీరేశం, రాంచంద్రారెడ్డి, నర్సింహులుగౌడ్, లచ్చప్ప, నర్సింహులుయాదవ్, కృష్ణ, పెద్ద హన్మయ్య పాల్గొన్నారు.

గుడి కోసం గొడవ

▸ మాదంటే మాదంటున్న రెండు గ్రామాలు



ఎల్లమ్మ దేవాలయం

వికారాబాద్, జూన్ 13: గుడి కోసం రెండు గ్రామాల ప్రజలు గొడవలకు దిగుతున్నారు. గుడి మాదంటే మాదంటూ వాగ్వాదానికి దిగుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మదన్‌పల్లి గ్రామంతో పాటు కోట్‌పల్లి మండల పరిధిలోని నాగసాన్‌పల్లి రెండు గ్రామాల మధ్య ఉన్న ఎల్లమ్మ లొంక ఆలయం మా గ్రామ పరిధిలోకి వస్తుందంటే మా గ్రామం పరిధిలోకి వస్తుందని పోటీపడుతూ వాగ్వివాదానికి దిగుతున్నారు. ఈ తతంగం గత వారం రోజులుగా జరుగుతుండగా రెండు రోజుల కిందట పోలీస్, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని గొడవ కాకుండా చూసేందుకు సర్వే చేసేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఇరుగ్రామాల మధ్య గొడవ జరుగకుండా పోలీసులు అక్కడ బందోబస్తుగా ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే ఎల్లమ్మ లొంకలో ఎల్లమ్మ తల్లి కోరిన కోరికలు తీరుస్తుందని విశ్వసిస్తూ భక్తులు పెద్ద మొత్తంలో అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఆది, మంగళ, శుక్రవారాల్లో ఇక్కడ జాతర వాతావరణం కనిపిస్తుంటుంది. భక్తులు వారి మొక్కలు చెల్లించుకుని కోడి పుంజులు, మేకలు అమ్మవారికి సమర్పిస్తారు. ఈ క్రమంలోనే పెద్ద మొత్తంలో కానుకలు సైతం అమ్మవారికి సమర్పిస్తారు. అయితే అక్కడే పూజలు నిర్వహించే నాగసాన్‌పల్లి తండాకు చెందిన మహిళ పూజలు చేస్తూ ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటూ వస్తోంది. ప్రస్తుతం ఆలయానికి వచ్చే ఆదాయంపై అందరి కన్ను పడినట్లు తెలుస్తోంది. ఆదాయం కోసమని కొందరు చెబుతుంటే మరికొందరు సర్వే హద్దుల ప్రకారం ఏ రెవెన్యూ పరిధిలోకి వస్తే వారికి ఆలయాన్ని అప్పగించాలని కోరుతున్నారు. వెంటనే అధికారులు జాయింట్ సర్వే చేయించి ఆలయాన్ని ఏదో ఒక గ్రామానికి అప్పగించడం లేదా ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలిపే విధంగా చర్యలు తీసుకోవాలని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దొంగల ముఠా సంచారంపై
అప్రమత్తంగా ఉండాలి : పోలీసులు

ఇబ్రహీంపట్నం, జూన్ 13: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిసర ప్రాంతాల్లో థార్ అనే భయంకరమైన దొంగల ముఠా ఒకటి సంచరిస్తున్నట్లు ఆనవాళ్లు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం పోలీసులు సలహా చేశారు. ఈ మేరకు వాట్సాప్ గ్రూపుల్లో ఓ పోస్టు కూడా వైరల్ అవుతోంది. హయత్‌నగర్ రాచకొండ పరిసర ప్రాంతాల్లో యూపీకి చెందిన ఓ ముఠా సంచరిస్తోందని, ఐదుగురు వ్యక్తులు గల ముఠా పట్టణ శివారు ప్రాంతాల్లో లాడ్జీల్లో ఉంటూ చోరీలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. పగటి పూట తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్నారని, రెక్కీ నిర్వహిస్తూ రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంతేగాక గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో రాత్రిళ్లు చొరబడి డోర్ కొడుతున్నారని, వ్యక్తులపై దాడులకు తెగబడి దోచుకునే ప్రయత్నంలో ఉన్నారంటూ ప్రచార ప్రకటనలో పేర్కొన్నారు. రాత్రివేళ ఎవరైనా అపరిచితులు డోర్ కొడితే తొందరపడి తీయవద్దని కూడా సలహా చేస్తున్నారు. ఏదైనా అనుమానం ఉంటే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సలహా చేస్తున్నారు.

గొర్రెలకాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

యాచారం, జూన్ 13 : గొర్ల మందల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ ఎ.నర్సింహారావు ఓ ప్రకటనలో సూచించారు. గొర్రెకాపరులు, యజమానులను గుర్తుతెలియని దండగులు బెదిరించి గొర్లను అపహరించేందుకు యత్నిస్తున్నారని.. అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇటీవల మందల నుంచి గొర్రెలను అపహరించిన ఘటనలు అనేకం ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దొంగలు మంద వద్దకు వచ్చి బెదిరిస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేస్తే తక్షణమే సంఘటనా ప్రదేశానికి చేరుకుంటామని పేర్కొన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే సమాచారమందించాలని కోరారు. కాగా, గొర్రెల మందలను గ్రామానికి దూరంగా పెట్టరాదని, మంద వద్ద కనీసం ఇద్దరు ముగ్గురు కాపలా ఉండాలని సూచించారు.



గున్‌గల్ గేటు సమీపంలో సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై వాహనాలు ఢీకొనడంతో కూలిన రెయిలింగ్

రెయిలింగ్‌ను సరిచేయండి ప్లీజ్..

యాచారం, జూన్ 13 : హైదరాబాద్-నాగార్జునసాగర్ ప్రధాన రహదారిని 15 ఏళ్ల క్రితం డబుల్ రోడ్డుగా మార్చారు. ఈ క్రమంలో గున్‌గల్ గేటు సమీపంలో రెండు చోట్ల ప్రమాదాలు చోటుచేసుకోకుండా భారీ ఇనుప కమ్మీలతో రెయిలింగ్ ఏర్పాటు చేశారు. అయితే, ఇటీవల లారీలు రెయిలింగ్‌కు తాకుతూ వెళ్లడంతో ధ్వంసమైందని, ప్రమాదాలు జరిగేందుకు అవకాశముందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెయిలింగ్‌కు మరమ్మతులు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షల శిక్షణకు
దరఖాస్తుల ఆహ్వానం



మల్లేశం, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి

వికారాబాద్, జూన్ 13: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షల ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూల శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎన్.మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 కొరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో రెసిడెన్షియల్ పద్ధతిలో ఇంటిగ్రేడెట్ గైడెన్స్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖతో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు 2025 తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాజేంద్రగనర్‌లో గల గిరిజన ఐఏఎస్ స్టడీసర్కిల్ ద్వారా రెసిడెన్షియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. అభ్యర్థులను ఆబ్జెక్టివ్ టైప్, ఆప్టిట్యూట్ పరీక్ష ద్వారా ఎంపిక చేయబడుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3లక్షలు మించరాదన్నారు. అభ్యర్థులు హెచ్‌టీటీపీ://ఎస్‌టీయూడీవైసీఐఆర్‌సీఎల్,సీజీజీ.జీవోవీ.ఐఎన్‌లో లాగిన్ అయ్యి జూన్ 13 నుంచి జూన్ 30 వరకు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ అప్లికేషన్ సూచనలకు హెచ్‌టీటీపీః//ఎస్‌టీయూడీవైసీఐఆర్‌సీఎల్‌ఈ. సీజీజీ.జీవోవీ.ఐఎన్ లేదా హెచ్‌టీటీపీః//టీడబ్ల్యూడీ.టీఈఎల్‌ఏఎన్‌జీఏఎన్‌ఏ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 6281766534 నెంబర్‌ను అన్ని పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల లోపు సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న మస్కు మహేష్

కందుకూరు, జూన్ 13: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు పాడుపడిన తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కళాకారుల సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు మహేష్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గుమ్మడవెల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం కాలికి గజ్జ కట్టి.. గోసి గొంగడేసి గ్రామ గ్రామాన తిరిగి ధూంధాం కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర ప్రజలను మరింత చైతన్యం చేసినట్లు గుర్తుచేశారు. తమ కష్టాన్ని గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కేవలం రాజకీయ నాయకులు బాగుపడ్డారు తప్ప.. ఉద్యమకారులకు ఎలాంటి న్యాయం చేకూరడం లేదన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి ఆదుకోవాలన్నారు. ఉద్యమకారులు ధన్నారం జంగయ్య, శివకుమార్, కిరణ్‌కుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నవీన్‌కుమార్‌రెడ్డికి ఘన స్వాగతం

▸ కొత్తూర్, షాద్‌నగర్‌లో గజమాలతో సత్కారం

▸ ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన నవీన్



కొత్తూర్ : నవీన్‌కుమార్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తూర్/షాద్‌నగర్/ఆమనగల్లు, జూన్ 13: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొంది శాసన మండలిలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొట్ట మొదటిసారిగా షాద్‌నగర్ నియోజకవర్గానికి వచ్చిన నవీన్‌కుమార్‌రెడ్డికి కొత్తూర్ మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ వద్ద, షాద్‌నగర్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భారీ గజమాలలను క్రేన్‌ల సహాయంతో నవీన్‌కుమార్‌రెడ్డి మెడలో వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కొత్తూర్ నుంచి షాద్‌నగర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా అభిమానులు బాణసంచా పేలుస్తూ, మేళాతాళాలతో నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. అంతకు ముందు తిమ్మాపూర్ వద్ద గల శ్రీ వేంకటేశ్వర దేవాలయాన్ని నవీన్‌కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. షాద్‌నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయానికి నవీన్‌కుమార్‌రెడ్డి తన కాన్వాయ్‌తో తరలివెళ్లారు. అక్కడ షాద్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ కొందూటి నరేందర్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్‌తో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డిని శాలువలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీ వైస్ ఛైర్మన్ ఈట గణేష్, కేశంపేట ఎంపీపీ వై.రవీందర్ యాదవ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు ఎంఎస్ నటరాజ్, జోలీ రవీందర్, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ, కడెంపల్లి శ్రీనివాస్, బి.దేవేందర్‌యాదవ్, సీనియర్ న్యాయవాది జగన్‌మోహన్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, శివచారి, పెంటనోళ్ల యాదగిరి, కోస్గి శ్రీను, మెండె కృష్ణ, కళ్లెం నర్సింహారెడ్డి, బాలయ్య, అజయ్ మిట్టునాయక్, కడాల శ్రీశైలం, రాఘవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నవీన్‌రెడ్డికి నాయకుల అభినందనలు

ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన నవీన్‌కుమార్ రెడ్డిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాసనమండలి ఆవరణలో నవీన్‌రెడ్డిని కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. బీఆర్ఎస్ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు జట్టుకట్టి గట్టిపట్టుతో నవీన్ రెడ్డిని గెలిపించడం అభినందనీయమన్నారు. అదేవిదంగా కడ్తాల జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ లచ్చిరాం నాయక్‌లు నవీన్ రెడ్డిని కలిశారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కొడంగల్: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో ఉషశ్రీ



శ్రీబాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి



పరిగి: విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన ఉపాధ్యాయులు

కొడంగల్/కొడంగల్ రూరల్, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీవో ఉషశ్రీ అన్నారు. మండలంలోని హుసేన్‌పూర్, కొడంగల్ ప్రాథమిక పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బాకారం మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి కొండన్న, షైముదా పాల్గొన్నారు. అదేవిధంగా కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ తండా ప్రాథమిక పాఠశాలలో మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, అంగన్‌వాడీ పిల్లలకు పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు, హన్మునాయక్, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, ఆయా మోతిబాయి పాల్గొన్నారు. కొడంగల్ పట్టణంలోని శ్రీబాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే, పాఠశాల కరస్పాండెంట్ గురునాథ్‌రెడ్డి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డి, జయతీర్థచారి, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటయ్య పాల్గొన్నారు. కొడంగల్‌లోని పాటిమీదిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు.

దౌల్తాబాద్: గోకఫస్లాబాద్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ శకుంతల, ఎంపీటీసీ కేశవరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు నర్సింహారెడ్డి, నర్సింహులు, ఉపాధ్యాయులు సాయిలుగౌడ్, వీరన్న, రేణుక, శానమ్మ పాల్గొన్నారు.

పరిగి: బడిబాటలో భాగంగా నస్కల్ పాఠశాల హెచ్‌ఎం కె.పాండుగురువారం మండల పరిధిలోని నస్కల్ పాఠశాలలో ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంపూర్ణవెంకటేశ్, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ అధ్యక్షురాలు పద్మమ్మ, రైతుబంధు మాజీ అధ్యక్షుడు ఎం.రాంజేందర్, నర్సింహులు, మాణిక్యం, ప్రేమలత పాల్గొన్నారు.

వికారాబాద్: విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని కౌన్సిలర్ గోపాల్ అన్నారు. మద్గుల్ చిట్టంపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ప్రకాష్‌గౌడ్ అన్నారు. మండలంలోని జినుగుర్తి గ్రామ సమీపంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గురువారం నూతన విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణ మోడల్ స్కూల్ 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు ఉన్నాయన్నారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు,నోటు పుస్తకాలు, యూనిఫాంలు అందజేస్తామన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్‌లో విద్యార్థినీలకు హాస్టల్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు.



వికారాబాద్: విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న కౌన్సిలర్ గోపాల్



దౌల్తాబాద్: గోకఫస్లాబాద్‌లో విద్యార్థులకు యూనీఫాంలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

మాజీ మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు



మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్‌ను శాలువాతో సత్కరిస్తున్న నాయకులు

ఘట్‌కేసర్, జూన్ 13: మాజీమంత్రి టి.దేవేందర్‌గౌడ్‌ను గురువారం ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు వేముల సంజీవగౌడ్, మున్సిపాలిటీల నాయకులు సామల జగన్‌మోహన్‌రెడ్డి, పాటి సురేందర్‌రెడ్డి, టి.మహేష్, దేవేందర్ గౌడ్‌ను ఆయన నివాసంలో కలిశారు.

గ్రామాల్లో మౌలికసదుపాయాల కల్పనకు కృషి



తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 13: గ్రామాల్లో మౌళికసదుపాయాల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అవుషాపూర్ గోల్డెన్ వ్యాలీలో రూ.7లక్షల మండల నిధులతో ఏర్పాటు చేయనున్న మంచినీటి పైపులైన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏనుగు కావేరిమశ్చేందర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ హరిణి, నాయకులు జిల్లాల రాజశేఖర్ రెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, సాయిలు, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో గుంతల పూడ్చివేత

తాండూరు రూరల్, జూన్ 13: శాంతిభద్రతలను కాపాడటంతోపాటు ప్రజలను ఇబ్బందులు తొలగించే సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేస్తామని కరన్‌కోట్ పోలీసులు నిరూపించారు. తాండూరు-గౌతాపూర్ మార్గంలో రహదారిపై అడుగుకో గుంత ఏర్పడింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులతోపాటు పాదచారులు కూడా ఇబ్బందులు పడ్డారు. ఈ గుంతల్లో పడి పలువురు ప్రమాదాల బారినపడుతున్నారు. గోతులను పూడ్చేందుకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో గత కొన్ని రోజులుగా పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ విషయంపై దృష్టి సారించిన కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి గురువారం జేసీబీ సాయంతో నాపరాతి వ్యర్థాలతో గోతులను పూడ్చేసే పనులు చేయించారు. దగ్గరుండి ఒక్కో గుంతలో నాపరాతి వ్యర్థాలను వేయించి గుంతలు పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేయించారు.

జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు స్కూల్స్‌లో రాయితీ కల్పించాలి



డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు

వికారాబాద్, జూన్ 13: వికారాబాద్ జిల్లాలో పనిచేసే జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల్లో రాయితీ కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకాదేవిని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీధర్ కోరారు. గురువారం యూనియన్ నాయకులతో కలిసి వెళ్లి వినతి పత్రం అందజేశారు. వీలైనంత త్వరగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సర్క్యులర్ జారీ చేస్తామని డీఈవో హామి ఇచ్చారు. ఆయన వెంటా నాయకులు రాఘవేందర్, చంద్రశేఖర్, రాజు తదితరులు ఉన్నారు.

రైతులకు సేవలందించడమే ధ్యేయం



దుకాణ సముదాయాలను ప్రారంభిస్తున్న చైర్మన్ రామిరెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 13: రైతులకు సేవ లందించడమే రైతు సేవాసహకార సంఘం ధ్యేయమని ఆ సంఘం చైర్మన్ సింగిరెడ్డి రామిరెడ్డి అన్నారు. మండలంలోని ఎదులాబాద్‌లో రైతు సేవా సహకార సంఘం నిధులతో నిర్మించిన దుకాణ సముదాయాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మండలంలోనే వ్యవసాయ ఆధారిత గ్రామమైన ఎదులాబాద్‌లో రైతులకు అందుబాటులో ఉంచడానికే దుకాణ సముదాయాలను ప్రారంభించినట్లు గుర్తుచేశారు. రైతుల సౌకర్యార్థమే ఈ దుకాణాల్లో ఎరువులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులకు సేవలందించడానికి ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం కృషిచేస్తుందన్నారు. రైతులకు పంట, బంగారు రుణాలు అందజేసి వారిని ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ అనంత రెడ్డి, డైరెక్టర్లు కె.ఉదయ్‌కుమార్‌రెడ్డి, రేసు లక్ష్మారెడ్డి, గ్యార వెంకటేష్, చందుపట్ల ధర్మారెడ్డి, గోపు బాల్‌రాజ్‌యాదవ్, మహేందర్, స్రవంతి, జెడిగే రమేష్‌యాదవ్, రామకృష్ణారెడ్డి, సంఘం ఎండీ కరుణాకర్, వివేక్, రైతులు విశ్వనాథం, చెన్నప్ప, ఇంద్రారెడ్డి, సత్యనారాయణ, అశోక్, భిక్షపతి, శంకరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను పెంపునకు రంగం సిద్ధం



ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయం

ఘట్‌కేసర్, జూన్ 13: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఇంటి పన్నులను భారీగా పెంచేందుకు మున్సిపల్ అధికారులు రంగం సిద్ధం చేశారు. మున్సిపాలిటీలో గతంలో అధికారులు చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రజలపై పన్నుల భారం మోపేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. మున్సిపాలిటీలో 18వార్డులుండగా మొత్తం 7వేలకు పైగా గృహాలున్నాయి. ఇందులో 575వాణిజ్య భవనాలున్నట్లు అధికారులు గుర్తించారు. మున్సిపాలిటీలు ఏర్పడిన అనతి కాలంలోనే గతంలో ఉన్న ట్యాక్సులను రెట్టింపు చేశారు. అధికారులు అప్పట్లో నాయకుల వత్తిళ్లకు తలొగ్గి లేక పని భారం తగ్గించుకోవడానికో గాని నివాస గృహాలకు, వాణిజ్య భవనాలకు ఒకే రకమైన పన్నులు వేశారు. ఇలా ఐదు సంవత్సరాలు గడిచి పోయాయి. మున్సిపాలిటీ ఆదాయం కేవలం సిబ్బంది జీతాలు, ఇతర ఖర్చులకే సరిపోతున్నాయి. దీంతో అధికారులు అలస్యంగా తేరుకొని ఆదాయ వనరుల పెంపునకు ఆలోచనలు మొదలు పెట్టారు. ఇంకేముంది వెంటనే జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పన్నులను పరిశీలించి పన్నులు పెంచేందుకు కసరత్తు చేపట్టారు. ప్రస్తుతం నివాస గృహములకు, వాణిజ్య భవనములకు 0.15 శాతం చొప్పున సమానముగా పన్నులు వసులు చేస్తున్నారు. కానీ ఇక నుండి నివాస గృహములకు 0.20శాతం, వాణిజ్య భవనాలకు 0.50శాతం పన్నులు విధించేందుకు సన్నాహాలు చేపట్టారు. ఇందుకోసం నివేదికలను సిద్ధం చేసి పాలకవర్గం ముందు పెట్టేందుకు ఏర్పాట్లు చేశారు. కొన్ని లర్ల ద్వారా సమాచారం బయటకు పొక్కడంతో వెంటనే స్పందించిన చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్ సమావేశం ఏర్పాటు చేసి మునిపాలిటీ ఆదాయ వనరులను పెంచేందుకుగాను కేవలం వాణిజ్య భవనాల ట్యాక్సులనే పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈవిషయమై స్థానిక బీఆర్ఎస్ నాయకులు ట్యాక్సుల పెంపునను ఉపసంహరిచుకోవాలని కమిషనర్‌కు ఈ సందర్భంగా వినతి పత్రం అందజేశారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

శామీర్‌పేట, జూన్ 13: అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడి దాన్ని పేద, నిరుపేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని ఎంపీటీసీ సగ్గు శ్రీనివాస్ తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. అలియాబాద్ గ్రామ ఎంపీటీసీ సగ్గు శ్రీనివాస్ శామీర్‌పేట మండల తహసీల్దార్ యాదగిరిరెడ్డిని గురువారం కలిసి అక్రమ కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి పత్రాన్ని అందజేశారు. అలియాబాద్ గ్రామ రెవెన్యూ పరిధిలోని శామీర్‌పేట పెద్ద చెరువు సమీపంలో గల సర్వేనెంబర్-509/1లోని 12ఎకరాల ప్రభుత్వ భూమిని కెప్టెన్ డీకే గిరి అనే వ్యక్తి దర్జాగా కబ్జాచేసి అక్రమాలకు పాల్పడినట్లు ఎంపీటీసీ తహసీల్దార్‌కు వివరించారు. ఈ విషయమై రెండేళ్లుగా మండల రెవెన్యూ అధికారులకు ఎన్నో సార్లు విన్నవించినా, ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆయన తహసీల్దార్ ముందు ఆందోళన వ్యక్తం చేశారు. రక్షణ చర్యలను తీసుకోవాలని ఎంపీటీసీ తహసీల్దార్‌ను కోరారు. అట్టి ప్రభుత్వ భూమిని అలియాబాద్ గ్రామానికి చెందిన ఇళ్లులేని పేద, నిరుపేదలకు ఇళ్లస్థలాల కోసం కేటాయించి ఆదుకోవాలని ఎంపీటీసీ తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై తహసీల్దార్ యాదగిరిరెడ్డి స్పందిస్తూ తన దృష్టికి ప్రభుత్వ భూమి కబ్జా అయినట్లు వచ్చిన ఆరోపణల పట్ల తగు విచారణ జరిపి ప్రభుత్వ భూమి కబ్జాపై అవసరమైన చర్యలను చేపడతామన్నారు.

సంక్షిప్తంగా..

● **బషీరాబాద్:** మండల కేంద్రంలో గోదాం, ఇళ్ల స్థలాల కేటాయింపుకు బషీరాబాద్ రెవెన్యూ అధికారులు గురువారం ప్రభుత్వ భూములను పరిశీలించారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి ఆదేశానసారం తహసీల్దార్ వై.వెంకటేష్, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్‌తో కలిసి ఇందర్‌చెడ్ మార్గంలోని సర్వే నంబర్ 183లో గోదాం నిర్మాణానికి ఎకరాం స్థలం, అలాగే జీవన్గి మార్గంలోని గోసాయి కాలనీ వద్ద సర్వే నంబర్ 72లోని 6 ఎకరాలను ప్రభుత్వ అసైన్డ్ భూమిని ఇళ్ల స్థలాలకు గుర్తించారు వీరి వెంట ఆర్ఐ రాకేష్ న్నారు.

●**పూడూరు:** మండల పరిధిలోని మిట్టకంకల్ గ్రామంలోని 7వ వార్డుసభ్యులు యాదయ్య సిహెచ్.శేఖర్ తండ్రి చాకలి నర్సింహులు మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు గురువారం జరుగగా, ఈ అంత్యక్రియల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఉపసర్పంచ్ భేరి రాంచందర్ యాదవ్, మాజీ సర్పంచ్ మొగ్రి శ్యాంకుమార్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొని నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం తెలిపారు.

● **దోమ:** ఈ నెల 15న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేశ్‌బాబు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 15న ఉదయం 11 గంటలకు ఎంపీపీ అనసూయ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

డీకే అరుణను కలిసిన తాండూరు బీజేపీ నాయకులు



డీకే అరుణను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు, జూన్ 13: మహబూబ్‌నగర్ ఎంపీగా గెలుపొందిన డీకే అరుణను గురువారం తాండూరుకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు నరేష్ మహరాజ్, బీజేపీ జిల్లా నాయకులు సుదర్శన్‌గౌడ్, బంటారం భద్రేశ్వర్, రాము కలిశారు. బీజేపీ నుంచి ఎంపీగా గెలిచినందుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

రక్షణ కల్పించాలని డీజీపీకి వినతి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 13: రియల్‌వ్యాపారుల నుంచి తనకు ప్రాణహాని ఉందని పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ, లక్ష్మినర్సింహా కాలనీకి చెందిన సురేష్‌బాబు రాష్ట్ర డీజీపీకి వినతి పత్రం అందజేశాడు. రియల్ వ్యాపారు రావుల సురేష్ అతడి అనుచరుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, గతంలో అతనిపై కేసు నమోదు చేయించినందుకు తనపై కక్ష కట్టినట్లు తెలిపారు. తమ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పోలీసు పెట్రోలింగ్ పెంచాలని ఈ సందర్భంగా డీజీపీని కోరాడు.

దొంగల ముఠాతో అప్రమత్తంగా ఉండాలి



అవుషాపూర్‌లో గ్రామస్తులకు కల్పిస్తున్న ఘట్‌కేసర్ పోలీసులు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 13: ధార్ దొంగల ముఠాతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఘట్‌కేసర్ సీఐ తెలిపారు. అవుషాపూర్‌లో గురువారం సాయంత్రం ధార్ దొంగల ముఠాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ధార్ దొంగల ముఠా నగర శివారుప్రాంతాల్లో సంచరిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ ముఠా ఎక్కువగా లాడ్జీల్లో తాత్కాలికంగా నివాసముంటూ తాళంవేసిన ఇళ్లను, గేటెడ్ కమ్యూనిటీ, శివారు ప్రాంతాల్లో ఉండే ఇళ్లను టార్కెట్ చేసి దొంగతనాలు చేస్తారు. వీరు ఐదారుగురుగా ఒక ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతుంటారు. ముందుగా పగటి పూట ఆటోలో రెక్కీ నిర్వహించి మెయిన్ గేటు నుంచి కాకుండా ప్రహరీదూకి దూకి లోపలికి ప్రవేశిస్తారని తెలిపారు. తలుపులు నెట్టి తలుపులు తీయగానే ఇంట్లోని వ్యక్తులపై దాడి చేసి విలువైన వస్తువులను, బంగారు ఆభరణాలను దోచుకెళ్తారని తెలిపారు. రాత్రి సమయాల్లో ఎవరైనా తలుపులు తడితే తీయకుండా డయల్ 100కు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కిటికీలో నుంచి చూసి కాలనీవాసులను, పక్కవారిని అప్రమత్తం చేయాలన్నారు. మన ప్రాంతాల్లో అనుమానంగా సంచరిస్తే 100తో పాటు పోలీసు అఫీసర్ల 8712580132, 8712579961, 8712662183 లేదా 8712579976కు సమాచారం ఇవ్వాలని కోరారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బషీరాబాద్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బషీరాబాద్ ఎస్ఐ రమేష్‌కుమార్ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని మంతట్టి గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, రక్షణాత్మక డ్రైవింగ్, 100 డయల్, రోడ్డు ప్రమాదాలు, డ్రంక్‌అండ్‌డ్రైవ్, పోక్సో కేసులు తదితర అంశలపై సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా గ్రామస్తులకు కళాజాత బృందం అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐ మట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని, ఎవరైనా ఫోన్లు చేసి వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా మహిళల రక్షణ కోసం షీటీంలు పని చేస్తున్నాయన్నారు. ఆకతాయిలు వేధించినా, గృహహింసకు గురైనా షీటీంను సంప్రదించాలన్నారు. నేరాల అదుపునకు ప్రజలు తమవంతుగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, మహిళలు పలువురు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటోను ఢీకొన్న లారీ.. ఇద్దరు మృతి

● మరో ఇద్దరి పరిస్థితి విషమం ● 11 మందికి గాయాలు



పులుసుమామిడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం

వికారాబాద్, జూన్ 13: ఓ కుటుంబ సభ్యులు, వారి బంధువులు ఓ శుభకార్యానికి వెళ్తుండగా మృత్యువు లారీ రూపంలో వచ్చి ఇద్దరి ప్రాణాలను కబలించింది. మరో ఇద్దరు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మరో 11మందికి తీవ్రగాయాల పాలైన సంఘటన గురువారం వికారాబాద్ మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నవాబుపేట మండలం ఎల్లకొండకు చెందిన ఓ కుటుంబం ఆటోలో వికారాబాద్ పట్టణ పరిధి మద్గుల్ చిట్టంపల్లిలో ఓ శుభకార్యానికి వస్తోంది. చించల్‌పేట గేట్ వద్ద ఎదురుగా వస్తున్న సిమెంట్ లారీ వీరి ఆటోను ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న గొల్లగూడ కిష్టయ్య(60) అక్కడికక్కడే మృతిచెందాడు. గొల్లగూడ బుచ్చమ్మ(53) చికిత్స పొందుతూ మృతిచెందింది. తీవ్ర గాయాలైన ఆటో డ్రైవర్ ఎండీ షాకిర్, సత్తమ్మల పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. అలాగే అంతయ్య, రాంచంద్రయ్యలకు కూడా బలమైన గాయాలవడంతో వారిని సైతం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. ఆటోలో ఉన్న ఒకే కుటుంబంకు చెందిన వారు, వారి బంధువులు లక్ష్మి, జంగయ్య, కిష్టయ్య, పుష్పమ్మ, రత్నమ్మ, నర్సిములు, చంద్రమ్మ, పార్వతమ్మ, జంగయ్యలకు గాయాలుగాకా స్థానిక ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 108 వాహనం త్వరగా చేరుకోక పోవడంతో క్షతగాత్రులను స్థానికులు ఆటోల్లో ఆసుపత్రికి తరలించారు. వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ నాగరాజు ఆసుపత్రికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. ఎల్లకొండ వాసులు వికారాబాద్ చేరుకుని క్షతగాత్రులకు సాయం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత



మృత్యువాతపడిన ఎద్దు

పెద్దేముల్, జూన్ 13: విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాతపడింది. ఈ ఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కందనెల్లి గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కందనెల్లి గ్రామానికి చెందిన బోయిని చిన్న మొగులయ్య తనకున్న కొద్దిపాటి వ్యవసాయ పొలంతో పాటు ఇతరుల పొలాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ పనులకు రూ.1,80,000 వెచ్చించి రెండు ఎడ్లను కొనుగోలు చేశాడు. ఆకాడెద్దులతోనే వ్యవసాయ పనులు చేస్తుండేవాడు. గురువారం పొలంలో పనులు చేస్తుండగా తాగునీటికని కాడెడ్లను వదిలేశాడు. అవి రెండూ పొట్లాడుకుంటూ వ్యవసాయ మోటారుకు కరెంట్ కనెక్షన్ వచ్చిన సర్వీస్ వైరును తగిలాయి. దీంతో సర్వీసు వైరు తెగిపోయి ఒక ఎద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృత్యువాతపడింది. ప్రభుత్వం రైతును ఆదుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

అటవీ భూమిని దున్నిన వారిపై కేసు



దోర్నాల్ అడవిలో దున్నిన అటవీ భూమి

ధారూరు, జూన్ 13: ధారూరు రేంజ్‌లోని దోర్నాల్ బీట్‌లో అక్రమంగా అటవీ భూమిని దున్నిన వారిపై కేసు నమోదు చేశామని పారెస్టు సెక్షన్ అధికారి మోయినొద్దీన్ తెలిపారు. దోర్నాల్ బీట్‌లో గత మార్చిలో ఐదు ఎకరాల్లో ప్లాంటేషన్ కోసం తవ్విన దాదాపు 2500 గుంతలను పూడ్చి వేసి దున్నివేశారు. ఈ అటవీ భూమిని మండల పరిధిలోని దోర్నాల్‌కు చెందిన సయ్యద్ మహిబూబ్, ఆజం, చంద్రప్పలు దున్నారని గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. ఇదే బీట్‌లో పీసీఎం తండాకు చెందిన లాలునాయక్ రెండు ఎకరాల అటవీభూమిని ఆక్రమించి దున్నివేసి చదును చేసి ఆక్రమించగా కేసు నమోదు చేశామని తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎఫ్ఎస్‌వో మోయినొద్దీన్ తెలిపారు.

పదోన్నతిపై వచ్చిన జీహెచ్‌ఎంకు సన్మానం

దోమ, జూన్ 13: దోమ మండలానికి గురువారం పదోన్నతిపై దాదాపూర్ జడ్పీహెచ్ఎస్‌కు వచ్చిన జీహెచ్ఎం డి.అమర్‌నాథ్‌ను పీఆర్‌టీయూ సంఘం నాయకులు సన్మానించారు. అదేవిధంగా అయినాపూర్‌కు బాబుచంద్, మోత్కూర్‌కు ఎల్.మల్లేశ్వర్, దిర్సంపల్లికి బి.వెంకటయ్య, దోమ మండల కేంద్రానికి జి.అంజనేయులు, దోమ బాలికల ఉన్నత పాఠశాలకు బి.శ్రీనివాసులు, గుండాల్‌కు పి.మల్లారెడ్డిలను పీఆర్‌టీయూ దోమ మంల శాఖ అధ్యక్షుడు ఆర్.కేశవులు, ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర బాధ్యుడు గోపాల్, లాల్య, కృష్ణయ్య, మండల, జిల్లా బాధ్యులు భీమయ్య, వీరప్ప, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు పురస్కారాలు

మేడ్చల్ టౌన్, జూన్ 13: ఏప్రిల్ నెలలో ఇందనం పొదుపు చేసిన మేడ్చల్ ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్లు కండక్టర్లకు గురువారం ప్రగతి చక్రాల పురస్కారం అందజేశారు. డిపో మేనేజర్ ఏ.సుధాకర్ ఆర్టీసీ కార్మికులకు శాలువాకప్పి సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ రామారావు, అసిస్టెంట్ ఇంజనీర్ స్నేహలత, సూపరింటెండెంట్ టి.సత్యానారాయణ ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

బాధిత రైతు కుటుంబానికి అండగా ఉంటాం

కులకచర్ల, జూన్ 13: బాధిత రైతు కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. ఇటీవలే చౌడాపూర్ మండలంలోని లింగన్‌పల్లిలో వడ్డె లాలుకు చెందిన ఐదు గేదెలు పిడుగుపాటుకు మృత్యువాతపడ్డాయి. ఈ విషయాన్ని స్థానికుల నాయకుల ద్వారా తెలుసుకున్న ఆయన తాను అందుబాటులో లేకపోయినా స్థానిక నాయకుల ద్వారా బాధిత రైతు కుటుంబానికి గురువారం రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ఎల్లవేళలా ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామన్న మాదిగ, దత్తు, రాములు, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

కాలనీల్లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

ఘట్‌కేసర్, జూన్ 13: కాలనీల్లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని విజయపురి కాలనీవాసులు గ్రామసభలో మొరపెట్టుకున్నారు. చౌదరిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామసభలో జనాలు పలు సమస్యలను వివరించారు. ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డికి వారి సమస్యలను విన్నవించారు. ప్రధానంగా ఇటీవల కురిసిన రెండు వర్షాలకే విజయపురి కాలనీలోని నాలుగు ఇళ్లల్లోకి వరదనీరు చేరిందని వాపోయారు. పలు కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని వాపోయారు. తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని వెంటనే పరిష్కరించాలని కోరారు. డ్రైనేజీ, కోతుల, కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శశికుమార్ వివిద కాలనీల నాయకులు, జనాలు పాల్గొన్నారు.